## హాస్యం హాస్యం

# నీళ్ళు

◆ మహర్షి ◆

అంతసేపు గోతికాడ నక్కలా నల్లా దగ్గర కావలా కాస్తున్న ఆ పిల్ల ఆనందంతో కెవ్వున అరచి "అమ్మోయ్... నల్లాలో నీళ్ళొస్తున్నాయే" అనేటప్పటికి చుట్టు ప్రక్కల ఇళ్ళలో నుండి అమ్మలక్కలు బిందెలు పట్టుకుని గొంతు చిరిగి పోయేలా అరుస్తూ బిలబిలమంటూ బయట కొచ్చారు. "ఏడకలా పరుగెడుతున్నావ్... ముందుగాల నేను పట్టుకోవాల. తప్పుకో, తప్పుకో..." ఒకావిడ మొహం నిండా బొట్టు పెట్టుకుని రెండు చేతులతో ఆరు బిందెలు పట్టుకుని గబగబా వచ్చింది.

"ఆగవే నంగనాచి టింగు బుర్ర. లైనులో నేను ముందున్నాను. నిన్న సాయంత్రమే అక్కడ రాయి పెట్టాను. తలుగు తలుగు" మరొకామె పోటీగా ఏడు బిందెలు పట్టుకుని ముందుకొచ్చింది.

"మర్యాదగా తప్పుకోండి ముందు నేనట్టు కోవాలి. నాక్కోపం వచ్చిందంటే... తెలుసుగా నా సంగతి, చితక తంతాను. లేకపోతే నా మొగుడనలే ఈ పేటకు రౌడి" అంటు కూతురికి, కొడుకుకు చెరో బిందె యిచ్చి తను ఆరు బిందెలు పట్టుకుని గునగున వచ్చి ఆగింది మరొకావిడ.

"మీరందరూ ఆగండహ్... నేను పోలీసోడి పెళ్ళాన్ని. నా మొగుడి చేతిలో పవరుంది. అందర్నీ లోపల పెట్టించి బిందెలతో చితక బాధించగలను" రంకెలు వేస్తు మరొకామె ఇంట్లో నుండి పైపు తీసుకుని రయ్యి రయ్యిమని వస్తున్నది.

"ఆగవే తిప్పలాడి. నీ మొగుడు పోలీసోడ యితే నాకేంటి, మినిష్టరయితే నాకేంటి. జుట్టు పట్టుకుని వంగదీసి మరీ కొడతాను. ముందు నేను పడతాను" అంటూ అందర్నీ ప్రక్కకు నెట్టి గబుక్కున నల్లా క్రింద బిందె పెట్టి గిర్రున తిప్పింది.

బుస్‌మని నిముషం సేపు రొద చేసి ఓ డ్రాప్ నీళ్ళు ఠంగ్‌న శబ్దం చేసి ఆగిపోయింది నల్ల.

"అమ్మో... అమ్మో.. మా టింగరోడికి ముందే చెప్పాను ఎవరికి పడితే వాళ్ళకి అలు సిచ్చి నీళ్ళు ఇవ్వవద్దని. మాయిదా రోడు చెబితే విన్నాడా? అయినా మా ఇంటికొచ్చి మీ కొట్లాటలేంటి? పొండవతలకు, ఇదేమన్నా మీ బాబు కట్టించిన పబ్లిక్ నల్లా అనుకున్నారా?" ఇల్లు గలావిడ కయ్ కయ్‌మని గోల గోల చేసి, జుట్టు పీక్కుని బాధ పడిపోయింది.

"చాల్లే నోరు మూసుకోవమ్మా... మంచి నీళ్ళు కూడా పట్టుకోనీయవా? అయినా మాకు నీళ్ళివ్వకపోతే నీ పంపుని విరగ్గొడతాం జాగ్రత్త" అని మరొకామె నల్లా కింద బిందెను విసురుగా లాగి నల్లాను గిరగిరా తిప్పింది.

మరొకామె ఆమె జుట్టు పట్టుకుని ఒక్క గుంజు గుంజింది. అమె వెల్లకిలా పడి రొప్పుతూ శాపనార్థాలు పెడుతున్నది. ఇంతలో మరొకామె ప్రక్కనున్నామె చీర సర్రున లాగింది.

అంతలో నల్లా పెద్ద శబ్దం చేసింది. అందరూ ఆశ్చర్యంగా అటువైపు చూశారు. నల్లా పెద్దగా నిట్టూర్చి రెండు చుక్కలు రాల్చి చప్పుడు చేయ కుండా ఆగిపోయింది.

అంతే... ఒకరిని ఒకరు బాదుకుంటున్నారు. భయంకరంగా తిట్టుకుంటున్నారు. ఒకరి చేతిలో ఒకరు వస్త్రాపహరణం గావించుకుంటున్నారు. ఇంటిగలావిడా అదంతా చూస్తూ మెటికలు విరుస్తూ తిట్టిపోస్తున్నది. అంతలో ప్రెస్ వాళ్లకు వార్త ఎలా తెలిసిందో హుటా హుటిన వచ్చారు. వారి చేతి నిండా పని దొరికినందుకు తెగ సంబరబడి పోయారు.

★ ★ ★ ★ ★

ఈ రోజు టీ.వి. వార్తలలో ముఖ్యమైన విశేషాలు. ఈ రోజు సిటిలో నీళ్ళ పంపు దగ్గర ఆడవాళ్ళ జుట్టు పట్టు లాటలో ఏడుగిరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఇరవై అయిదు మందికి స్వల్పంగా దెబ్బలు తగిలాయి. అనేక మందికి జుట్టు రాలిపోగా అది వాహన చోదకులకు చాలా ఇబ్బంది కలిగింది. ఆ జుట్టు పట్టులాట చూసి తరించాలే కానీ, వర్ణించలేమని పలువురు దూరంగా వుండి చూసిన వాళ్ళు తెలియజేశారు. వారి కొట్లాటను ఆపబోయిన పదిమంది కానిస్టేబుళ్ళను ఆడాళ్ళంతా విరగతన్ని, చితక బాది తరిమేశారని అధికార భోగట్టా.

ఈ ఆడవాళ్ళ జుట్టు పట్టులాటలో ఏదో విదేశీ హస్తం వుందని పలువురు మంత్రులు అను మానం వ్యక్తం చేశారు.

వీధికొక కుళాయి లేకపోవడం వల్ల వచ్చిన అనర్థమే ఈ జుట్టు పట్టులాటకు కారణమని ప్రతిపక్ష పార్టీ ఆరోపించగా ప్రభుత్వం దాన్ని తీవ్రంగా ఖండించింది.

కొందరు ఆడవాళ్ళయితే ఇక్కడ చెప్ప కూడని బోతులు తిడుతూ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారని తెలిసింది. ఈ వార్తలు ఇంత టితో సమాప్తం.

★ ★ ★ ★ ★

విన్న నగర మహిళా మండలి అధ్యక్షురాలు ఆనందంతో గంతులు వేసింది. తనకో మంచి అవకాశం వచ్చిందని గబగబా చంకలు గుద్దుకుని వెంటనే ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసింది. వీరనారీ మణిలా కథం తొక్కి, కోపంతో వూగిపోయింది. "నగరంలోని నీటి కొరత తీరే వరక, మహిళలకు జరుగుతున్న

● ● ●

**బంగాళాఖాతం నుండి తీసుకొస్తే జనాలకు ఉప్పు ఖర్చు తగ్గుతుంది.**

● ● ●

## ఈ రోజు టి.వి.లో ముఖ్యమైన వార్తలు నీటి సమస్యపై వాదులాడుకోగా సభ వేడెక్కింది.

అన్యాయాలు నశించే వరకు ఈ జుట్టు ముడివేసేది లేదు జడవేసేది లేదు" అన్నది వీరావేశంతో

"మేడం మీది బాబ్డ్ హెయిర్ కదా... మరి జుట్టు ఎలా ముడివేస్తారు, జడెలా వేస్తారూ..." అన్నాడొక విలేఖరి.

"ఇచ్చిన కూల్‌డ్రింక్ తాగి, చెప్పిన మేటరు చప్పుడు చేయకుండా రాసుకుంటే బాగుంటుంది" అన్నదామె కోపంగా చూస్తూ.

"సరి సరి... ఊరికే అలా జోక్ చేశానన్న మాట.. లేకపోతే నాకు తెలియదా ఏమిటి?" అన్నాడు విలేఖరి కళ్ళజోడు సరి చేసుకుంటూ.

ఆమె ఓ అయిదు వందల మంది ఆడాళ్ళను ప్రతిమాలి, బామాలి తీసుకొచ్చి తలొక కుండ కొనిచ్చి ఊరేగింపు లేవదీసింది. ఆమె అసలు ఆలోచన ఈసారి మంచి గుర్తింపు వస్తే అదే నియోజక వర్గంలో అసెంబ్లీకి పోటీ చేయాలని కోరిక. సమయం దొరికింది కదా అని దాన్ని సద్వినియోగం పరచుకోవాలనే ప్రయత్రంలో వుంది.


ఆమెను చూసి చాలా మంది ఆడవాళ్ళు తలో బిందె చేత బట్టుకుని బయలుదేరారు.

సెక్రటరియేట్ దగ్గిర బహిరంగసభ ఏర్పాటు చేసింది. అనేక మందిని ఆకర్షించేలా అలంకరించుకున్నది. "వారం రోజులలో నీటి సమస్యను తీర్చకుంటే హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంటాం" అని బెదిరించింది. ఆ మాట విన్న ఆడాళ్ళంతా తలో దిక్కున దొరికిన దారి వెంట పరుగందుకున్నారు.

★★★★★

అదే రోజు అసెంబ్లీలో నగర జలాల మీద చర్చ ప్రారంభమైంది.

"నగరంలో అసలు నీటి కొరతలేదు. నీరు అందించటానికి ప్రభుత్వం అనేక వందల కోట్లు ఖర్చు చేస్తున్నది. కావాలని ప్రతిపక్షం వాళ్ళు కుట్ర పన్నుతున్నారు" అని గట్టిగా మాట్లాడలేక చిన్నగా మూలిగారు మంచినీటి శాఖామాత్యుల వారు.




"నీటికే ఖర్చు పెడుతున్నామని అంతా మీరే దొస్తున్నారు" అన్నారు ప్రతిపక్షం వాళ్ళు.

దీనికంతకు కారణం ప్రతిపక్షం అంటే కాదని ప్రభుత్వం అని నిందించుకున్నారు. అక్కడి నుండి చర్చ నగరానికి ఏ నీరు తెస్తే బాగుంటుంది అనే దాని మీదకు మళ్ళింది.

"గోదావరి చాలా పవిత్రమైంది. కనుక గోదావరి నీళ్ళు తీసుకురావాలి" ప్రతిపక్షం వాళ్ళు అరచి గోలగోల చేశారు.

"ఠాట్ కాదు. నా భార్య పేరు కృష్ణవేణి. నా భార్య పేరు చిరస్థాయిగా నిలచి పోవాలంటే కృష్ణానది నీళ్ళు నగరానికి శ్రేష్టం. కనుక కృష్ణానది నీళ్ళు తీసుకొద్దాం" అన్నారు మంచినీటి శాఖామాత్యులు.

"ఈ రెండు నదుల నీళ్ళు వద్దు. ఎందుకంటే ఏ నది నీళ్ళు తీసుకొచ్చినా మీ ఇద్దరిలో ఎవరో ఒకరి కోరిక తీరుతుంది. మీలో మీరే కొట్టుకుంటారు. కనుక కావేరి నది నీళ్ళు తీసుకొస్తే ఎలా వుంటుంది" పాయింట్ లేవదీశారు మరో పార్టీ వాళ్ళు.

"ఇవన్నీ కాదు. బంగాళాఖాతం నుండి తీసుకొస్తే జనాలకు ఉప్పు ఖర్చు తగ్గుతుంది" అని ఇండిపెండెంట్లు గొడవ గొడవ చేశారు.

ఒకరి మీద ఒకరు అరచుకున్నారు. ఒకర్ని ఒకరు నెట్టుకున్నారు. ముష్టి యుద్ధాలు చేసుకున్నారు.

★★★★★

ఈ రోజు టీ.వి.లో ముఖ్యమైన వార్తలు. నిన్నటి నగర మహిళా మండలి అధ్యక్షురాలి బహిరంగసభకు స్పందించిన అసెంబ్లీ, నీటి సమస్యపై వాదులాడు కోగా సభ వేడెక్కింది. ఎవరకి తోచింది వారు చెప్పడంతో, ఆ అరుపులకు హోరెత్తిన సభ నుండి సభాపతి పారిపోయారు.

అసభ్య పదజాలంతో విమర్శించుకుంటున్న సభా ప్రాంగణంలోనికి ఆ పదాలను నోట్ చేసుకోవటానికి సిని రచయితలంతా చొచ్చుకు రాగా వారిని కంట్రోలు చేయటానికి కమెండోలు చాలా శ్రమ పడ్డారు.

బలా బలాలు తేల్చుకున్న ఎమ్మెల్యేలను వెంటనే హాస్పటల్లో చేర్పించారు. నీటి సమస్య ఓ కొలిక్కి రాకుండానే సభ రెండు నెలలు నిరవధికంగా వాయిదా వేశారు.

నీటి సమస్య మీద చర్చలు జరిగేటప్పటికి ఈ లోపల వర్షాలు పడి కొంత నీటి కొరత తీరుతుందని అనేక మంది భావించగా, కాదు యజ్ఞాలు చేసి వర్షాలు కురిపించవలసిందిగా ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. ఈ నీటి వార్తలు ఇంతటితో సమాప్తం.